క్లుప్తంగా

నోటు పుస్తకాల పంపిణీ


స్టేషనరీ పంపిణీ చేసిన బాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని కవ్వగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం బాలు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్టేషనరీ, నోటు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలకు చేరుకుని గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సాయి ప్రియ, మహిళా సంఘం సభ్యులు, స్థానికులు నాగేష్, సత్తయ్య, కృష్ణ, రాజు, ప్రభాకర్, నవీన్, పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు పెంచాలని నిరసన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత రెండు దశాబ్దాలుగా స్కాలర్‌షిప్‌లు పెంచడం లేదని ప్రభుత్వం వెంటనే పెరిగిన ధరలకు సమానంగా స్కాలర్‌షిప్‌లు పెంచాలని పీహెచ్‌డీ విద్యార్థులు శనివారం వీసీ భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఫీజులు పెంచుతూ విద్యార్థులపై భారం మోపుతున్నారని స్కాలర్‌షిప్‌లు పెంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవాలు


వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలోని మహాగణపతి పూర్వక శ్రీ గురు దత్తాత్రేయ సహిత శ్రీ సాయినాథ స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో పాటు రకరకాల పూలతో అలంకరించారు. తెల్లవారుజామున అభిషేకంతో వార్షికోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. అభిషేకం అనంతరం అలంకరణ, హోమం తదితర పూజది కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధునాతన ల్యాబ్


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ఏజీవర్సిటీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఫౌండేషన్ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో త్వరలో అధునాతన ల్యాబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం రఘునందన్‌రావు అన్నారు.శనివారం పీజేటీఏయూలోని సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ప్రీలాంచ్ కార్యక్రమానికి రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ల్యాబ్‌లో వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులతో పాటు ఇతర సాంకేతిక కోర్సులను అభ్యసించే విద్యార్థులను భాగస్వాములను చేయాలని సూచించారు. అదే విధంగా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న పరిశోధన, విద్య విస్తరణ కార్యక్రమాల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆయన సూచించారు. రానున్న 20 ఏళ్లలో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని తద్వారా ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వీసీ జానయ్య అన్నారు.

కుల్సుంపురా పార్కు అభివృద్ధికి కృషి

గోల్కొండ: కుల్సుంపురా పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శనివారం కుల్సుంపురా మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్నింగ్ వాక్ ప్రయోజనాలపై కుల్సుంపురా వాకర్స్ అసోసియేషన్ వారు ప్రజలకు మంచి అవగాహన కల్పిస్తున్నారన్నారు.

అలంకార ప్రాయంగా వాటర్ ప్లాంట్‌లు

- ఇళ్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- అన్ని పాఠశాలల్లో నీటి తిప్పలు
- పట్టించుకోని అధికారులు

శాస్త్రిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. స్వచ్ఛమైన నీరు అందించేదుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్యూరిఫైయర్ వాటర్ మిషన్లు పనిచేయడం లేదు. వాటర్ మిషన్లను మాత్రం ఏర్పాటు చేసిన అధికారులు వాటిని పర్యవేక్షించకపోవడంతో మూలన పడ్డాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. చాల వరకు ప్రభుత్వ పాఠశాలల్లోని వాటర్ ప్లాంట్‌లు పనికిరాకుండా పోతున్నాయి. ఫలితంగా వేలాది రూపాయాలు ఖర్చుచేసినా లాభం లేకుండా పోయింది. మిషన్లను ప్రారంభించకపోవడంతో విద్యార్థులకు శుద్ధజలాన్ని అందించలేకపోతున్నారు. ఫలితంగా విద్యార్థులు అంటు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగుమీడియం ప్రైమరీ పాటశాలల నుంచి హైస్కూల్ వరకు ఏ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు పని చేయడం లేదు. వాటర్ మిషన్‌ను ఏర్పాటు చేసినా అధికారులు పాడైన వాటికి మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


హసన్‌నగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటన్ క్యాన్


చింతల్‌మెట్ పాఠశాలలో అలంకార ప్రాయంగా ఉన్న వాటర్ ప్లాంట్


ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకొని తాగుతున్న విద్యార్థులు

వీధి వ్యాపారులను ప్రోత్సహించేందుకు కృషి


స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ పరిశీలిస్తున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: వీధి వ్యాపారులను ప్రోహ్సహించేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శనివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా కార్యాలయం ఆవరణలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గతంలో కేంద్ర ప్రభుత్వం చేప్పటిన ఆత్మ నిర్భర్ నిధి పథకంలో భాగంగా వీధి విక్రేయదారులకు గుర్తించి చిరువ్యాపారుల అభివృద్ధి పరుచుకునే దిశగా ముందడుగు వేయాలని, ఆర్థిక పరిపుష్టి, వారి కుటుంబ పోషణ మెరుగుపర్చుకోవాలని, వారికి కావాల్సిన ఆర్థిక సహాయానికి ప్రొత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈ.మంజులత, టి.పర్వతాలు, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, టీఎంసీ ఎస్.శ్రీలత పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. 13వ డివిజన్‌లోని సాయి బాలాజీనగర్ కాలనీలో శనివారం తడి, పొడి, చెత్తపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. 14వ డివిజన్‌లోని భవాని నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీంచి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ ఇళ్ల పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుదాం


మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకులు

అత్తాపూర్: ఉపాధ్యాయుల సమస్యలపై అందరం పోరాడి పరిష్కరించుకుందామని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్ అన్నారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యాదర్శి శ్రీనివాస్‌సాగర్, గౌరవ అధ్యక్షులు మణిక్యంరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు కన్నయ్య, గోవర్ధన్‌యాదవ్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్, సుధాకర్, శేరిలింగంపల్లి అధ్యక్షులు హనుమంతు, ఇబ్రహీంపట్నం అధ్యక్షులు పరమేష్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, పుష్పలతలు టీపీఆర్‌టీయూకు రాజీనామా చేసి పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వం తీసుకున్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు

అత్తాపూర్: నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు అన్నారు. అత్తాపూర్ డివిజన్ సులేమాన్‌నగర్‌లోని బిస్మిల్లా హోటల్ ప్రాంతంలో 12 సీసీ కెమెరాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఇంటి ఆవరణ, ప్రధాన కూడళ్ల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ చాంద్, ఇంతియాజ్, కె.రవి, మహ్మద్ తాహెర్, మహ్మద్ ముస్తక్, ముజాద్, మహ్మద్ సలీం, సయ్యద్ సిరాజ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళి

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి నిర్వహించారు. వీసీ అల్దాస్ జానయ్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు.


జయశంకర్ వర్ధంతిలో పాల్గొన్న అధికారులు

నేడు గవర్నర్ రాక

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పాల్గొనున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.కె.భట్టి గిన్నీస్ రికార్డు కార్యక్రమాన్ని, బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 5.45 గంటల నుంచి 6.45వరకు బృందావన్ గార్డెన్‌లో యోగాసనాలు ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్యక్రమంలో గవర్నర్, మౌంట్‌ఆబూకు చెందిన సీనియర్ రాజయోగి రాజు, హైదరాబాద్ సబ్ జోన్ ఇన్‌చార్జీ రాజయోగిని.బి.కె.కుల్‌దీప్ దీదీ, కిమ్స్–ఉషాలక్ష్మీ బ్రెస్ట్ క్యాన్సర్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ రఘురాం పాల్గొంటారు.

బోనాల ఏర్పాట్ల పరిశీలన

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు అన్ని రకాల పనులు వేగంగా జరుగుతున్నాయని జగదాంబిక మహంకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సి.వసంత అన్నారు. శనివారం ఆమె గోల్కొండ కోటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బోనాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారన్నారు. ముందస్తుగానే ఒక ప్రణాళిక రూపొందించుకొని దానికి అనుగుణంగా పనులు జరుగుతున్నాయన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ న్యూ కిషన్‌నగర్‌లో శనివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంబంధించింది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం..న్యూ కిషన్‌నగర్‌లో ఖాలేద్‌కు చెందిన బిల్డింగ్‌లో ఫర్నీచర్ షాప్ ప్లేవుడ్ గోడౌన్ నిర్వహిస్తున్నాడు. మరో షాపులో మహ్మద్ గౌస్ అట్టాల గోడౌన్ నిర్వహిస్తున్నాడు. మూడంతస్తుల ఈ భవనంలో ఉదయం 4 గంటలకు మంటలు అంటుకుని పొగలు వస్తుండడంతో స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. హైడ్రా విభాగం నుంచి రోబో వెహికిల్ కూడా తీసుకువచ్చి మంటలను ఆర్పేందుకు ఉపయోగించారు. అగ్నిప్రమాదం సంభవించిన రెండో అంతస్తులో నివసిస్తున్న 13 మంది ఫర్నీచర్ వర్కర్లను అగ్నిమాపక సిబ్బంది కిందకి దింపి 108లో ప్రథమ చికిత్సలు నిర్వహించారు.

27న ప్రత్యేక ప్యాకేజీతో ఆలయాలకు బస్సు సౌకర్యం

రాయదుర్గం: హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్ ప్యాకేజీని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని , నగర శివారులో ప్రజలు ఎక్కువగా వెళ్ళే దేవస్థానాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నట్టు డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 27వ తేదీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఉంటుందని పెద్దలకు రూ.350, చిన్నారులకు రూ.200 టికెట్ ఉంటుందన్నారు. నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయం, కాళీమాత ఆలయం, అనంతగిరి పద్మనాభస్వామి ఆలయం, ఎన్కతల శనీశ్వరాలయాలకు ప్యాకేజీ వర్తిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9948082462, 7382906847లలో సంప్రదించాలని ఆయన కోరారు.


యోగా దినోత్సవంలో పంచవటి కాలనీ వాసులు


యోగా దినోత్సవంలో పాల్గొన్న నార్సింగి మున్సిపల్ సిబ్బంది


యోగా దినోత్సవంలో పాల్గొన్న మణికొండ శ్లోక స్కూల్ విద్యార్థులు


ఖానాపూర్‌లో యోగా దినోత్సవంలో పాల్గొన్న త్రివేణి స్కూల్ విద్యార్థులు


సీబీఐటీలో యోగా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, సిబ్బంది


మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు


యోగాలో పాల్గొన్న ఉద్యానవన విద్యార్థులు

యోగా డే

ఆధునిక ఉరుకుల, పరుగుల జీవితంలో శారీరక శ్రమ లేకపోవటం, మానసిక ఒత్తిడిని జయించటంతో పాటు మన జీవనశైలిని మార్చుకునేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రతి రోజు యోగా చేయడం ఎంతో అవసరమవన్నారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం


గండిపేటలో యోగా దినోత్సవంలో పాల్గొన్న రిధిరా గ్రూప్ సభ్యులు


సమతా స్ఫూర్తి కేంద్రం ఆవరణలో యోగా ప్రదర్శనలో పాల్గొన్న ప్రముఖులు


తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగా చేసుతన్న డైరెక్టర్ అభిలాష బిష్త్


కోకాపేటలో యోగా దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ నాయకులు


బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో కమిషనర్ శరత్‌చంద్ర


పెద్దతాళ్లకుంట పార్కులో యోగాసనాలు వేస్తున్న ప్రజలు


మైలార్‌దేవ్‌పల్లి జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో యోగాసనాలు చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి